# అనగనగా ఒక కథ

## సినీతేజం

జ్నం

**కృష్ణానగర్ అంటే- మద్రాస్‌లో పాండీ బజార్‌లా వుంటుంది.**

**కాబోయే చిరంజీవులూ-కాబోయే రాఘవేంద్రరావులూ-కాబోయే పరుచూరులు, వేటూరులూ..చాలామంది వుంటారక్కడ.**

సాయితేజ 'చిరంజీవం'త వాడు కావాలని కృష్ణానగర్‌లో వెలిశాడు.

సాయితేజ యాక్టివ్‌గా అందర్నీ కలుస్తున్నాడు-పలకరిస్తున్నాడు.

ఆ పూటకి టిఫిన్ ఎవడు పెడతాడా? 'టీ' ఎవరు పోయిస్తాడా అన్న ఆశతో- ఆకలి ప్రేరేపిస్తోంది.

మరింత ఉత్సాహంగా అందర్నీ హాయ్ అంటూ పలకరించి - భాయ్ అంటూ కౌగిలించుకుంటూ షేక్ హాండ్లిస్తూ చిరంజీవి పద్దెనిమిదో తమ్ముడిలా షోకులు పోతున్నాడు.

నిజం చెప్పాలంటే ఈ ఉత్సాహం నటించడం సాయితేజకి బాగా వచ్చు- అదొక్కటే దేవుడిచ్చిన వరం.

సినిమాల్లో నటిద్దామని ఈ వూరు వచ్చి పడిగాపులు పడుతున్నాడు. కాళ్ళకి బలపాలు కట్టుకుని అవి అరిగిపోయేలా తిరుగుతున్నాడు. కానీ ఒక్క....డైరెక్టరూ సాయితేజ గ్లామర్‌కి..'ఆహా ఓహో' అనట్లేదు..వేషం ఇవ్వట్లేదు.

ఒకళ్ళిద్దరు పెద్ద డైరెక్టర్లు పదే పదే వస్తోన్నందుకు పొమ్మంటూ చిరాకు పడి..''బాబూ! నువ్వెప్పుడైనా మొహం అద్దంలో చూసుకున్నావా?'' అని మొహమ్మీదే అనేశారు.

''ఈ సినిమాలో అన్నీ చిన్న వేషాలే నెక్స్ట్ పిక్చర్‌లో వేషం పెద్దది ఇస్తా''నన్నాడు- అని నవ్వు మొహాన్ని పులుముకుని బైటకొచ్చి చెప్పేవాడు.

అందరికీ నిజం ఏమిటో తెలుసు-

ఆ విషయం వాళ్ళకీ తెల్సనీ సాయితేజకీ తెల్సు.

నవ్వు నటించకపోతే...'హాయ్-భాయ్' అనే వాళ్ళ దృష్టిలో లోకువై పోతాం- అని అతనికి అనుభవం నేర్పిన పాఠం.

టిఫిన్ సెంటర్లోకి అడుగు పెట్టాడు మిత్రబృందంతో. జేబులో చెయ్యి పెట్టుకుంటే ఐదు రూపాయల కాయిన్, రెండు రూపాయల కాయిన్ చేతికి తగిలాయి.

కళ్ళు తిరిగాయి.

హాయ్ భాయ్‌లు..ముగ్గురు ఎదురుగుండా కూచున్నారు. వాళ్ళూ తన లాంటి వాళ్ళే..పాపం వాళ్ళకి ఈ ఏడ్రూపాయలూ ఉండవ్!

సప్లైయర్ రాగానే 'టూ బై ఫోర్ ఛాయ్' అన్నాడు సాయితేజ-

''ఏం గురూ...బన్నూ..బ్రెడ్డూ..కనీసం బిస్కట్లు కూడా ఇప్పించవా ఏంటి?'' అన్నాడు కాబోయే మహా దర్శకుడు.

''ఇవ్వాళ గురువారం..నేను 'టీ' తప్ప ఏమీ తాగను, ఇప్పించను'' సాయితేజ సాయిబాబాని అడ్డెట్టుకుని బతికిపోయాడు.

పక్క టేబుల్నించి ఆ పక్క టేబుల్ మీదికి ఆఖరికి వీళ్ళ టేబుల్ మీదికి వచ్చిన న్యూస్ పేపరులో సినిమా వార్తలు ఆ హోటల్లో టీ తాగే వాళ్లందరికీ ముఖ్యవార్తలు.

ఎవరెప్పుడు ఏ సినిమా ప్రారంభిస్తున్నారో-

ఏ స్టూడియోలో షూటింగ్ జరుగుతుందో-

అక్కడికి పరుగెట్టాల్సిన నటీనటులు అందరూ-

సాయితేజకి తెల్సు- పెళ్లి మండపంలో విందులు అయ్యాక పడేసే విస్తరాకులు ఎక్కడుంటాయో వెతుక్కునే కుక్కల బతుక్కీ..తమ లాంటి వారికీ తేడా లేదనీ..మనస్సు చాలాసార్లు వెనక్కి లాగుతోంది. కానీ రేపో నేడో తానో గ్రేట్ హీరో అవుతానని, తన టాలెంట్ అలాంటిదనీ నమ్మకం బలంగా ఉండటం వల్ల చాటుగా తన భుజాలు తానే తట్టుకుని పాత సినిమాల్లో డైలాగ్స్ వప్పజెప్పి..'శభాష్' అనిపించుకుని, అలా అన్న 'హాయ్..భాయ్'లకు, టీలూ టిఫిన్లూ గట్రా పోయించేస్తాడు. పక్క టేబుల్ నుంచి ప్రదక్షణమయి వస్తున్న పేపరు రాగానే అందరూ లాక్కున్నారు.

ఓ పేజీ తనకీ దొరికింది.

అది సినిమా పేజీ కాదు.

'సరేలే! వాళ్ళు చదివేదాకా..ఇదే తిరగేద్దాం' అనుకుని పేపరు చూడ్డం మొదలెట్టాడు సాయితేజ.

ఆశ్చర్యం..తన ఫోటో పేపర్లో వచ్చింది.

ఏమిటి..? నా ఫోటో దీంట్లోకెలా వచ్చింది- అని ఆలోచించే వ్యవధే లేదతనికి.

గబగబా ఆ ప్రకటన చదివాడు. 'విన్నపం' అని హెడ్డింగ్..''ఏవండీ మీరు ఎక్కడున్నా సినిమా వార్తల కోసమయినా పేపరు చూస్తారని నాకు తెల్సు- మీరు గొప్పనటుడైతే ఎలాగా మాతో గడిపే టైముండదు. ఈలోగా ఇంటికి రండి. అబ్బాయికి కొడుకు పుట్టాడు. అచ్చం మీ పోలికే..మనవణ్ని చూడ్డానికైనా రండి..మీ కోసం ఎదురుచూస్తున్న మీ శ్రీమతి లక్ష్మి''

నాకు ముప్పైయ్యేళ్ళే అంటూ హాయ్ భాయిల్తో చెప్పుకొస్తున్న సాయితేజకి ముచ్చెమట్లు పోశాయి. ఆ వార్త చదవగానే-

పనివున్నట్లు మంచినీళ్ళ గ్లాసు తొణికించి- ఆ పేపరు మీద వొలకబోశాడు.

ఆ పేపర్ని ఉండచుట్టి బయట పడేశాడు కానీ...వయసుని తగ్గించలేడు.

ఒకళ్ళిద్దరు తెల్సున్న వాళ్ళు కనిపిస్తే వాళ్లు పేపరు చూసుంటారేమోనని మొహం చాటేశాడు.

అర్జంటుగా ఓ తెల్సున్న వాళ్ళ దగ్గరకెళ్ళి ఐదొందలు అప్పుచేసి, పెళ్ళానికి ఫోను చేసి చడామడా తిట్టాడు.

''చాలా డబ్బులైపోతున్నాయి. మీ తిట్ల దండకం ఆపి, కాసిన్ని డబ్బులు మిగిల్చి-కాకినాడకి టిక్కెట్టు కొనుక్కుని తగలడండి'' అంది భార్య.

టప్పున ఫోను పెట్టేశాడు.

కాకినాడ కెళ్ళాలని కాదు- ఈ కాసిన్ని పైసలుంటే ఎవరో ప్రొడక్షన్ మేనే

జర్‌కి బిర్యానీ తినిపించి వేషం అడగొచ్చని.

తనకి బ్రెడ్ లేకపోయినా పర్వాలేదుగానీ..కాస్తో కూస్తో పలుకుబడి వున్న వాళ్ళకి బిర్యానీలూ..బీర్లూ నైవేద్యం పెడితే ఓ వేషం దొరకచ్చు- అదీ ఆశ-

నెల్లాళ్ళు ఇంటికి దూరంగా ఉండి..ఒక్కసారైనా కెమెరా ముందు నిలబడకపోతే...ఇంటికెళ్ళినా ఇంత కూడా గౌరవం దక్కదు.

ఓ ప్రొడక్షన్ మేనేజర్‌ను పట్టాడు సాయి తేజా...అనుకున్నట్టుగా తీర్థప్రసాదాలకి రెండొందలు ఖర్చుపెట్టాడు.

బ్రేవ్ మని త్రేన్చిన ప్రొడక్షన్ మేనేజర్ ''నీకు జూనియర్ ఆర్టిస్టు కార్డుందా?'' అని కిక్కులో ఎకసెక్కాలాడాడు.

సాయితేజా కళ్ళు ఉప్పుటేరులా పొంగిపోయాయి.

ఒక ఫ్రెండుతో కలిపి తీసుకున్న రూంకెళ్ళి బావురుమని ఏడ్చాడు.

తన వ్యధకి ముగింపులా ఇంటి ఓనరొచ్చి తలుపు తట్టాడు.

గుండె గుభెల్లుమంది సాయితేజకి..'ముసలాడు అద్దెకోసం వచ్చాడేమో'నని కంగారుపడ్డాడు.

రూం పార్ట్‌నర్‌గానున్న సంతోష్ నా చొక్కాలు రెండు పట్టుకుని పారిపోయాడు.

''బాబూ! సాయితేజా''

''గుడ్ ఈవెనింగ్ సార్''

''నీతో చిన్న పని పడిందయ్యా!''

అద్దెకని చెప్పిచావొచ్చుగా అనుకున్నాడు- నీళ్ళు నములుతున్న సాయితేజతో.

''నేను అర్జంటుగా సామర్లకోటకు వెళ్ళాలి-రెండ్రోజుల్లో తిరిగొచ్చేద్దాం-నాకు తోడొస్తావా?''

''నేనా! సామర్లకోటకా! నాకు చాలా షూటింగ్‌లున్నాయి. ఇవ్వాళ రేపట్లో రెండు కంపెనీలు నాకు 'కీ'రోలు ఇస్తామన్నారు. కానీ మీకోసం వస్తాను. కానీ..నాకింకా ఇంటి దగ్గర్నుంచి మనియార్డరు రాలేదు. మీతో వ...చ్చి! మళ్ళీ తిరిగొచ్చి..మీ అద్దె కట్టి..ఇవన్నీ..కొంచెం ప్రాబ్లమే'' ఫోజు కొట్టాడు సాయితేజ.

నిజం తనకి తెలుసు.

అబద్ధం ఆడటం..నటిస్తూ గొప్పలు చెప్పడం..వీటన్నిటి వల్లే..తనకి నటుడవుతానన్న తహతహ బయల్దేరింది.

ఫ్రెండ్సందరూ..తన డైలాగ్ మాడ్యులేషన్ విని- 'ఆహో ఓహో' అని..నిక్షేపంలాంటి ఉద్యోగాన్ని ఒదులుకొమ్మని రెచ్చగొట్టారు.

రెండేళ్ళబట్టి ఇండస్ట్రీ చుట్టూ ప్రదక్షిణం-ఈ మధ్యలో ఒకట్రెండు సీరియల్స్‌లోనో..విడుదలకు నోచుకోని సినిమాలోనో గ్రూప్‌లో రంగేసుకున్నాడు.

నిజానికి..కెమెరా ముందుకు వెళ్ళినప్పుడు వేసుకున్న రంగు కన్నా..వేషాల కోసం తిరిగేప్పుడు వేసుకున్న రంగులే ఎక్కువ.

ఎంత కోటింగ్ కొడితే తాత వయసువాడు-కొడుకు వయసుకు రాగలడు?

''ఏవయ్యా! ప్లీజ్..నేనొక్కణ్ణి వెళ్ళలేను-నీకు తెలుసుకదా!'' ఇంటి



ఓనరు మళ్ళీ బతిమాలాడు.

''ఓకే సార్! మీకోసం వస్తున్నాను'' అన్నాడు సాయితేజ. కనీసం అద్దె ప్రెజర్ తగ్గుతుందన్న ఆశతో-

సామర్లకోట వరకు వెళ్ళి-కాకినాడ వెళ్ళకుండా-మనవణ్ణి చూడకుండా వచ్చెయ్యగలడా? వెళ్ళి పెళ్ళాం పర్మిషన్తో వెనక్కి తిరిగి రాగలడా?

అస్తవ్యస్త పరిస్థితిలో..హౌస్ ఓనర్ నుంచి డబ్బులు తీసుకుని టికెట్ కోసం బయల్దేరబోయాడు.

''నీ వేషాలు పాడు చేసుకున్నందుకూ..నాకు తోడు వస్తున్నందుకు..ఈ నెల ఇంటద్దె కట్టక్కర్లేదయ్యా'' అని ఓనర్ అనగానే దేవుడున్నాడనిపించి-

బట్టలు సర్దుకునే నెపంతో..ఫ్రేమ్ అవుట్ అయిపోయాడు.

ఇప్పుడు సాయితేజ...సామర్లకోటలోనే హౌస్ ఓనర్‌కు సేవ చేస్తాడా?

ఆ రెండ్రోజుల్లో కాకినాడ వెళ్లి భార్యనీ...మనవణ్నీ చూస్తాడా? జవాబు..బట్టలు మడత పెట్టే వంకతో, మొహానికి హత్తుకున్న చొక్కాకి తెలుసు.

ఆ బట్టల చాటున పొంగుతున్న కన్నీళ్ళకు తెలుసు.

☆